# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటరూరల్, సెప్టెంబర్ 3 : పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, వారి సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను బాధితులు, లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాధవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహకారం అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గానికి చెందిన దాదాపు 250 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల తాసీల్దార్లు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద నష్టాన్ని అంచనా వేయండి

- కలెక్టర్ సంతోష్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 3: భారీ వర్షాలకు జిల్లాలో వరద నష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక ఎప్పటికప్పుడు అందజేయడానికి వాస్తవిక నివేదికలను సమర్పించాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఆస్తినష్టం, ప్రాణనష్టం, పంట నష్టం వివరాలను శాఖల వారీగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల పంట నష్టం వాటిల్లిందని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మంది రెస్క్యూచేసి కాపాడిన పూర్తి వివరాలతోపాటు, పశువులు, పాఠశాలలు, ఆసుపత్రుల డ్యామేజీ వివరాలను సైతం అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంపుల వివరాలను సైతం వెల్లడించాలని సూచించారు. ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు నష్టంతోపాటు కల్వర్టులు, బిడ్జిల నష్టాన్ని వెల్లడించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాల వల్ల వరద నష్టాన్ని అంచనా వేస్తున్నామని వివరించారు. జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గతనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు జిల్లాలో 20.7 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని పేర్కొన్నారు. ఏమైనా చెరువులు, కెనాల్, బ్రిడ్జిలు దెబ్బతిన్న వివరాలను ఇరిగేషన్‌శాఖ సమర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దెబ్బతిన్నాయో విద్యాశాఖ నుంచి వివరాలను సేకరించాలని సూచించారు. తాసీల్దార్లు, ఎంపీడీవోతో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఇండ్లు కూలినవి సమగ్ర వివరాలు తెలియపరచాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ద్వారా సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కలెక్టరేట్ ఏవో సమాగ్ర సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

వెల్దండ, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో అసిస్టెంట్ కుక్ (వంట సహాయకులు), మోడల్ కళాశాల వసతి గృహంలో కేర్ టేకర్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి చంద్రుడు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4, 5వ తేదీల్లో సాయంత్రం 5 గంటలలోపు కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వంట సహాయకులకు విద్యా అర్హత 7వ తరగతి, 18 నుంచి 45ఏళ్ల లోపు వయస్సు కల్గి ఉండాలని, మోడల్ వసతి గృహ కేర్‌టేకర్ పోస్టుకు ఏదేనా డిగ్రీ, బీఈడీ పాసై ఉండాలి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్, సెప్టెంబర్ 3: విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించే ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను కొల్లాపూర్‌లోనే నిర్మించాలని బీఎస్పీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలిసి కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం ఆర్డీవో నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలన్ని కొల్లాపూర్‌లో ఉన్నాయని కొల్లాపూర్‌లో చదివే విద్యార్థులు హాస్టల్ కోసం 20 కిలోమీటర్లు ప్రయాణం చేయడం కష్టమన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కొల్లాపూర్‌లోనే హాస్టల్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు అంజి, నవీన్, రాము, విష్ణు ఉన్నారు.

## ఎస్సీ హాస్టల్‌లో వరద నీటిని తొలగించాలి

కొల్లాపూర్, సెప్టెంబర్ 3 : మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లోకి వరద నీళ్లు రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ ఫయాజ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ హాస్టల్‌లోకి వరద నీళ్లు తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను సీపీఐ పట్టణ కార్యదర్శి యూసఫ్‌తో కలిసి సందర్శించారు. హాస్టల్‌లో నీళ్లు నిల్వడం మూలంగా కాలకృత్యాలను తీర్చుకోలేని పరిస్థితి ఉందని, విద్యార్థులను ప్రత్యామ్నాయంగా మరోక్క హాస్టల్‌కు షిఫ్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివుడు, మొయిద్దీన్, షఫీ ఉన్నారు.

## బాధితులను ఆదుకోవాలి

బిజినేపల్లి, సెప్టెంబర్ 3: మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇండ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకొని కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పాలెం గ్రామంలో వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాక్షికంగా కూలిన ఇళ్ల బాధితులకు రూ.20వేలు, పూర్తిగా కూలిపోయిన వారికి రూ.లక్ష అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మయ్య, దామోదర్, కాశిరెడ్డి, రవీందన్‌రెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం

కొల్లాపూర్, సెప్టెంబర్ 3 : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మంగళవారం కొల్లాపూర్ మండలంలోని చింతపల్లిలో సీపీఎం గ్రామ శాఖ మహాసభకు ఆయన హాజరైన మొదట ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల కార్యదర్శిలు శివ వర్మ, దశరథం, నాయకులు సురేందర్, రామకృష్ణ, శ్రీనివాస్, నర్సింహ, కురుమయ్య, కిరణ్ ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి

లింగాల, సెప్టెంబర్ 3 : పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి వీరస్వామి అన్నారు. మురుగునీరు, చెత్తాచెదారం ఉన్న పలు వార్డుల్లో పంచాయతీ సిబ్బందిచే శానిటేషన్ చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వీరస్వామి మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు అక్కడక్కడ వర్షపు నీరు చేరడంతో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వాటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగిందన్నారు. ప్రజలు తమ పరిసరాలలో చెత్తాచెదారం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకొవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శశిధర్, బాలు, శ్రీశైలం పాల్గొన్నారు.

## పోలీసులకు ప్రజలు సహకరించాలి

బల్మూరు, సెప్టెంబర్ 3 : గ్రామాల్లోని ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కల్గిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ రవీందర్, ఎస్సై గురుస్వామి, ఏఎస్సై రేణయ్య, పోలీసులు ఉన్నారు.

# నీట మునిగిన పంటల పరిశీలన

కొల్లాపూర్ : రామాపురంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కొల్లాపూర్, సెప్టెంబర్ 3: మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల మూలంగా నీట మునిగిన వరి పంటలను మంగళవారం మండల వ్యయసాయాధికారి చిన్న హుస్సేన్ పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు వర్షాల దెబ్బకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నట్లు ఏవో తెలిపారు. పంట నష్టం జరిగిన రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పంట నష్టంపై ప్రాథమిక అంచనా అనంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని పేర్కొన్నారు.

**కల్వకుర్తిలో..**

కల్వకుర్తి, సెప్టెంబర్ 3 : కల్వకుర్తి మండలంలోని ఎలికట్ట గ్రామ సమీపంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం కల్వకుర్తి వ్యవసాయాధికారి సురేశ్ పరిశీలించారు. గ్రామ సమీపంలో కేఎల్ఐ డీ-61 కాల్వ తెగిపోవడంతో వరి, పత్తి పంటలు నీట మునిగి దెబ్బతినగా.. ఏవో పరిశీలించారు. ఏవో వెంట రైతులు ఉన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 3 : మండలంలోని చంద్రబండ తండాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా ముందుజాగ్రత్తగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ విజయకుమార్ తెలిపారు.

## నర్సరీల పరిశీలన

ఊర్కొండ, సెప్టెంబర్ 3 : మండలంలోని రాచాలపల్లి, మాధారం గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో కృష్ణయ్య పరిశీలించారు. నర్సరీల్లో ఉన్న మొక్కలను వందశాతం నాటి వాటిని పెంచేవిధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మణ్‌నాయక్, నర్సింహులు, ఇందిర పాల్గొన్నారు.

# ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశ వర్కర్లు

వంగూరు, సెప్టెంబర్ 3 : తమ సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి శృతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు శివరాములు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని కోరారు. ఆశ వర్కర్లకు పని భారం పెంచి వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి వారికి ప్రసూతి సెలవులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు సూర్యకళ, సుమతమ్మ, ఆశలు చంద్రకళ, ఉమాదేవి, అలివేల, ధనమ్మ, స్వాతి, జ్యోతి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

# కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలి

- ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ

బిజినేపల్లి, సెప్టెంబర్ 3: విద్యార్థులు అధ్యాపకులు బోధించే పాఠాలను ప్రణాళికా ప్రకారం చదివి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు రాబట్టి కళాశాలకు మంచి గుర్తింపు తేవాలని నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలోని బాలాజీ గార్డెన్స్‌లో వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదికంటే ఈసారి కూడా మంచి ఫలితాలు రాబట్టి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్, అమర్‌నారాయణచౌదరి, మధుమోహన్‌రెడ్డి, గౌస్, వినోద్‌కుమార్, పద్మజ, రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు సన్మానం

విద్యార్థుల తల్లిదండ్రులకు మెమెంటోను అందజేస్తున్న సభ్యులు

అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 3 : 44వ నూలు పూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో 2023-24వ సంవత్సరంలో మెరిట్ సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా చిక్క భవ్యశ్రీ ఇంటర్‌లో 988, పులిజాల ప్రణదీప్, ఇమ్మడి మణిదీప్ ఎస్ఎస్‌సీలో 10 జీపీఏ సాధించడంతో వారికి మెమెంటో బహూకరించి శాలువాతో వారిని, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కోట కిశోర్, వనం పర్వతాలు, కర్నాటి నిర్మల, మ్యాకల సత్యనారాయణ, గంజి సుధాకర్, చిలువేరు శ్రావణి, దాసుపత్రి శకుంతల పాల్గొన్నారు.

## కొనసాగుతున్న తీజ్ ఉత్సవాలు

లింగాల, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలోని బంజార కాలనీలో నాలుగు రోజులుగా తీజ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన బంజార యువతులు మంగళవారం సమీపంలోని బోరు వద్ద నుంచి స్వచ్ఛమైన నీటిని తీసుకొచ్చి మొలకల బుట్టలపై పోశారు. కార్యక్రమంలో పూజారి బాలాజీ, నాయకులు శంకర్‌నాయక్, కిషన్‌నాయక్, శంకర్, దేవులా పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

తేది:03-09-2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణం నందు సాయినగర్ కాలనీలో గల సర్వే నెం. 149 గృహము నెం. 15-153/1, స్థల విస్తీర్ణం 88.75చ॥గ॥ = 74.20 చ॥మీ॥లలో నిర్మిత ప్రదేశం జి.యుఫ్ 697.00 చ॥ఫీ॥, యుఫ్.యుఫ్. 612.00 చ॥ఫీ॥, యన్.యుఫ్. 156.00 చ॥ఫీ॥, ఆర్.సి.సి.సదరు ఆస్తి డాక్యుమెంట్ నెం. 209/1976లో డి.విశ్వనాథం గారి నుండి కమ్మరి చంద్రయ్య గారు కొనుగోలు చేసినారు. ఆ తర్వాత సదరు కమ్మరి చంద్రయ్య గారు చనిపోవడం జరిగినది. పిమ్మట ఈ ఆస్తిని చంద్రయ్య కుమారులు వెంకటయ్య & శ్రీనివాసులు గారలు ఓరల్ పార్టిషన్ చేసుకున్నారు. ఆ పిమ్మట చంద్రయ్య గారి పెద్ద కుమారుడు ఉప్పునుంతల వెంకటయ్య గారికి చెందినదిగా వ్రాయించుకున్నారు. ఆ తర్వాత ఇట్టి ఆస్తిని సదరు వెంకటయ్య తన భార్య హేమలత గారికి డాక్యుమెంట్ నెం. 72/2002 దాన సెటిల్మెంట్ చేసినారు. పిదప ఇట్టి ఆస్తిని తేది: 22-05-2024 రోజున పై తెలిపిన ఉప్పునుంతల హేమలత భర్త వెంకటయ్య గారి నుండి నా క్లయింటు మూడావత్ జమిలి భర్త చంద్రు, నివాసం అచ్చంపేట గారు రూ.17,10,000/- లకు డాక్యుమెంట్ నెం. 1541/2024, తేది: 22-05-2024 నాడు కొనుగోలు చేసినారు. ఇట్టి ఆస్తి పైన ఎవ్వరికైనా ఏమైనా అభ్యంతరాలుంటే ప్రకటన వెలువడిన నాటి నుండి (7) రోజులలో స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని క్రింద తెలియపరచిన చిరునామాకు తెలియజేయగలరు. లేని యెడల పిమ్మట ఎలాంటి ఆక్షేపణలు చెల్లనేరవు.

పి. రామ్మోహన్ రావు, బి.ఎ., ఎల్.ఎల్.బి. న్యాయవాది & నోటరీ
పాత టి.డి.పి. కార్యాలయం ప్రక్కన, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా. సెల్ : 9494888072

# అనుమతి లేని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

వెల్దండ, సెప్టెంబర్ 3 : మండలంలోని కొత్ర గేటు వద్ద అనుమతి లేకుండా నడిపిస్తున్న ది ఐకాన్ స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా చేశారు. శాస్త్ర స్కూల్ పేరిట ఉన్న స్కూల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా ఐకాన్ పేరుతో నడిపిస్తున్నారని ఆరోపించారు. శాస్త్ర ఇంటర్‌నేషనల్ స్కూల్ అనుమతితో ఐకాన్ స్కూల్ రన్ చేస్తూ విద్యార్థుల వద్ద అధిక పీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎంఈవో, ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెల్దండ పోలీసులు జోక్యం చేసుకొని ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వినోద్, మహేందర్, అర్జున్, నితీన్, కార్తీక్, సాయి ఉన్నారు.

# ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

కల్వకుర్తి రూరల్ : పోషకాహారం గురించి వివరిస్తున్న సీడీపీవో

కల్వకుర్తి రూరల్/అచ్చంపేటటౌన్, సెప్టెంబర్ 3 : గర్భిణులు, యువతులు, బాలికలు నిత్యం పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ, కల్వకుర్తి సూపర్‌వైజర్ పద్మావతి కోరారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పలు అంశాలపైన అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్‌పైన ప్రతిజ్ఞ చేయించారు. అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ 10వ అంగన్‌వాడీ సెంటర్లో మంగళవారం పోషణ్ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృత హాజరయ్యారు. అనంతరం బ్లాక్‌బోర్డు, పోస్టర్‌పై అందరి సమక్షంలో కథలు, ఆటలు, పాటలు చిన్నారులచే పాడించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ బీసీ వెంకట్, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాల పండుగ

పెద్దకొత్తపల్లి : బోనాలతో ర్యాలీగా పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 3: మండలంలోని మరికల్, చిన్న కారుపాముల గ్రామాల్లో మంగళవారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకొన్నారు. పండగ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల వేడుకతో గ్రామాల్లో సందడి నెలకొన్నది.

**లింగాల మండలంలో..**

లింగాల, సెప్టెంబర్ 3 : మండలంలోని రాంపూర్, అంబట్‌పల్లి, కొత్తచెరువుతండాల్లో మంగళవారం బోనాల పండుగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా అలంకరించిన బోనాలను ఆయా గ్రామాల్లోని ప్రధాన విధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి పోచమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కలు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

కల్వకుర్తి, సెప్టెంబర్ 3 : కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వవిద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేక్‌కట్ చేసి పంచుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చలమందారెడ్డి, శ్రీను, అంజత్ అతీ, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

# హైనా దాడిలో రెండు లేగ దూడల మృతి

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 3 : తిమ్మాజిపేట మండలం చేగుంటలో పశువులకొట్టంలో కట్టేసిన రెండు ఆవుదూడలపై హైనా దాడి చేసి చంపేసింది. గ్రామానికి చెందిన ఉపేందర్ రెడ్డి పశువులను తన వ్యవసాయ పొలం వద్ద పశువులకొట్టంలో రోజూమాదిరిగా కట్టేయగా సోమవారం రాత్రి హైనా రెండు ఆవుదూడలపై దాడిచేసి చంపేసింది. ఒక దూడను సగభాగం తిని, వదిలేసి పోయింది. మంగళవారం ఉదయం యజమాని అక్కడికి వెళ్లి చూడగా దూడలు మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని అటవిశాఖ అధికారులకు, పోలీసులకు, పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. మొదట చిరుతదాడిగా స్థానికులు భావించగా, అటవిశాఖ అధికారులు వచ్చిన తర్వత హైనాగా పేర్కొన్నారు. చనిపోయిన దూడలకు పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని, యజమానికి పరిహారానికి కృషి చేస్తామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి చింటు తెలిపారు. అడవి జంతువుల సంచారంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అదుపుతప్పి కారు బోల్తా

- మహిళ మృతి, ఇద్దరికి గాయాలు

వంగూరు, సెప్టెంబర్ 3 : అదుపుతప్పి కారు బోల్తా పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సర్వారెడ్డిపల్లితండా గేటు వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం మేరకు హైదరాబాద్ నుంచి ఇన్నోవా కారులో శ్రీశైలం వెళ్తున్న ఓ ముస్లిం కుటుంబం హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ఉన్న ఫాతిమా(32) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయలైయ్యాయి. గాయపడ్డ వారికి కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వారిని వెల్దండ సమీపంలోని యెన్నం దవాఖానకు తరలించారు. ఫాతిమా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# బైక్‌ను ఢీకొన్న కారు

- ఒకరి దుర్మరణం

వెంకటయ్య(ఫైల్)

చారకొండ, సెప్టెంబర్ 3: జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని జూపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం జూపల్లి గ్రామానికి చెందిన కడారి వెంకటయ్య(42) మంగళవారం ఉదయం తన బైక్‌లో పెట్రోల్ కోసం శ్రీశైలం ఎక్స్ రోడ్డు వద్ద పెట్రోల్ పోసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా జూపల్లి సమీపంలో అదే సమయంలో కల్వకుర్తి వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వెంకటయ్య